కథానిక

# దొంగలూ, బిచ్చగాళ్లూ

దండమూడి మహీధరకుమార్

రోడ్డుకు రెండు వేపులా ఆర్చీలా పెరిగివున్న పెద్దపెద్ద చెట్ల వరసనూ, ఆ చెట్ల సందుల్లోనుంచి తారు రోడ్డుమీద - కష్ట సుఖాలకు వలె కన్పించే వెలుగు నీడల్నీ, చూస్తూ పేవ్‌మెంట్ మీద మెల్లగా నడుస్తున్నాడు మధు. ఎందుకో ఆ దృశ్యం అతన్ని పరవశుణ్ణి చేసింది. నడుస్తూ మధ్య మధ్యన తలపైకెత్తి చూస్తున్నాడు. పెద్దపెద్ద భవనాలు కన్పిస్తున్నాయి. ఎదురుగా కన్పించే పానగల్ పార్కు బస్ స్టాపింగ్ వేపుకు చూస్తున్నాడు. ఆదివారం కావటం మూలాన జనం ఎక్కువగా కన్పిస్తున్నారు. బస్సుల్లో తోసుకొని మరీ ఎక్కుతున్నారు.

ఆమూలగావున్న పెద్ద గేటుగుండా కార్లు లోనికి పరుగెడుతున్నాయి. ఒకటి కాదు... రెండు కాదు . చాలా! అది ఆ ప్రాంతపు సోషల్ క్లబ్! కాథు దగినవాళ్లు లోనికివెళ్లి కూచుని పేకముక్కలు కలుపుతూ కాంటీన్‌కు కుర్రాళ్ళను పరుగెత్తిస్తున్నారు.

మధు ఆలోచిస్తున్నాడు - ఈ జేబులోని ఐదు రూపాయలకో ప్రోగ్రాం ఎలా నిర్ణయించుకోవాలా అని! ఆరు రోజులు ఆఫీసులో ఉదయం వెళ్లి సాయంత్రం దాకా యంత్రంలా పనిచేసిన తరువాత ఆదివారం ప్రత్యక్షమవుతుంది. ఈ రోజే. ఈ ఒక్కరోజే తన ఆఫీసును మరచి పోవాలి! తన మేనేజరుకు వంగి వంగి సలాం చేయాలనే విషయం గుర్తుంచుకోకూడదు. మాటిమాటికీ దృష్టి గడియారం వేపుకే వుంచాల్సిన అవసరం ఇవాళ లేదు. ఇవాళ కేవలం ఆనందంగా గడిపి వేయాలి నిన్నటిని గాని, రేపటినిగాని మనస్సులోకి తెచ్చుకోగూడదు. ఈ ఒక్కరోజే... ఈ రోజే .. కేవలం ఈ రోజు మాత్రమే నిర్విచారంగా గడపాలి!

- ఎన్నెన్నో ఆలోచన అలల్లో కొట్టుకలాడి ఆఖరికి — మౌంట్ రోడ్డు వెళ్ళి 'నెప్రూలా హోటల్స్'లో బాగా తిని, కాఫీ మటుకు 'ఇండియన్ కాఫీ హౌస్'లో తాగి, తిరిగి మళ్ళీ వెనక్కి నడిచి 'రాక్సీ'లో 'ది గరల్ ఆఫ్ ది ఇయర్' సినిమా చూడాలి అని నిర్ణయించుకొని కొస్త ముందుకు నడిచి స్టాపింగ్ దగ్గరకు వెళ్ళబోతుండగా "బాబా!" అని కేకేశాడు, చెట్టుకు దగ్గరగా ఫుట్ పాత్ మీద నేకూచుని అడుక్కునే కుంటి ముసలాడు. మధుకు ముందుకు అడుగు పడలేదు. జేబులోకి చేయిపోయింది. ఐదు రూపాయలు! ఐదు రూపాయలు! ముసవాడి ముందు పరిచివున్న గుడ్డమీద రెండు కానులు కనిపించాయి! మొహం ప్రక్కకు తిప్పుకునేప్పటికి సోషల్ క్లబ్‌లోనుంచి బిగ్గరగా నవ్వుతున్న శబ్దాలు వినిపిస్తున్నాయి ఆదివారం కావటంవల్ల రామకృష్ణ మిషన్ హైస్కూల్ భవనం నిద్రపోతున్నట్టుగా వుంది. రోడ్డున జనం "విలువగల దుస్తుల్లో తమలపాకులు నములుతూ, కబుర్లు చెప్పుకుంటూ, స్టాపింగ్ వేపుకూ, పాండీ బజారులోని దుర్గా కేఫ్‌కూ నడుస్తున్నారు. మధు లోలోన మథన పడుతున్నాడు. తన జేబులో ఐదురూపాయల కాగితం ఆ కాగితంమీద అశోక చక్రం! "సత్యమేవ జయతే!" ఎదుటి ముసలాడిముందు రెండు కానులు! ఆ కానులవేపూ, నిల్చున్న మధువేపూ దీనంగా చూసే నడువలేని ముసలాడు!

"ముసలాడికి ఆఫీసు లేదు. ఆఫీసులో మేనేజరు లేదు. నెమ్మదిగా నడిచే గడియారం లేదు. అయితే, ముసలాడికీ తనకీ ఆకలి వుంది. జీవితంమీద ఆశ నిలిచివుంది. ఇంతే వాడికీ తనకీ భేదం!

మౌంట్ రోడ్ కెళ్ళాల్సిన బస్ వస్తోంది. మధు మనస్సులో మళ్లీ 'నెప్రూలా హోటల్స్'

‘ఇండియన్ కాఫీ హౌస్’ రాక్సీ, రాక్సీలో చూపిస్తూండే ‘గరల్ ఆఫ్ ది ఇయర్’ సినిమా మెదులాడేప్పటికి- మధు అక్కడ నిల్చోలేక బస్‌కోసం పరుగెత్తాడు.

పదిహేను నిమిషాలనంతరం మధు మౌంట్ రోడ్‌లో దిగి ‘నెప్రూహా హోటల్స్’లో కెళ్ళి పదణాలు ఖర్చుపెట్టి ఇండియన్ కాఫీహౌస్ వేపుకు వెళ్తూండగా ‘బాబూ కాణీ!’ ‘పొద్దుట్నుంచీ ఏమీ తినలేగు బాబూ! ధర్మం!’ అంటూ అరుస్తున్న ముసలాణ్ణి మధు చూడదలుచుకోలేదు. ఈరోజు తను ఎవరికీ ఒక్క కాణీకూడా ధర్మంగా ఇవ్వడు. దీనిలోని ప్రతి ఒక్క కాణీ కూడా తన ఆనందంకోసం ఈ ఒక్కరోజే ఉపయోగపడాలి.

ఇండియన్ కాఫీ హౌస్‌లో కాఫీ తాగబోయే ముందు పదినిముషాలపాటు మధు సెంటర్‌లో ప్రక్కగా నిల్చొని వచ్చేపొయ్యే జనాన్ని చూచాడు. రెండు మూడు నిమిషాలపాటు ప్రక్కగా పెట్టివున్న పత్రికల ముఖచిత్రాల్ని చూచాడు. అవి ఎంతో అందంగా వున్నాయి! ఏదో హృదయానికి హాయి చేకూరినట్టుగా వుంది. ముఖచిత్రం ఆకర్షణీయంగా వున్న పత్రిక ఒకదాన్నికొని కాఫీకి బయలుదేరాడు.

కాఫీ తాగుతూంటే అతనిదృష్టి తనకు దగ్గర్లో కూచున్న భార్యాభర్తల మీదికి పోయింది. ఆ మరుక్షణంలో తనుకొన్న పత్రిక ముఖచిత్రం చూచాడు. “ఏం జీవితం .. వెధవ జీవితం” అని అనుకున్నాడు. కేవలం తనను తాను గుర్తుకు తెచ్చుకొని! “ఈ జీవితానికి ఎలాంటి విలువా లేదు. తనజీతం డెబ్భయ్‌రూపాయలు! ఇక పెళ్ళి చేసుకుంటే ఏం చాలుతుంది? ఏమి ఆనందాన్ని చూడగలను?” అని చీదరించుకొని ఎలాగో కాఫీతాగి మెట్లుదిగి కిందికి వచ్చాడు.

మరోక్షణంలో “రాక్సీ” గుర్తు కొచ్చింది. సినిమా మనస్సులో కదలాడింది. టైం అప్పటికి ఐదున్నరయింది. ఇక ఏమీ ఆలోచించక— ‘రాక్సీ”కి వెళ్ళిపోయాడు.

మధు అక్కడికి వెళ్ళేప్పటికి ఐదుంముప్పావయింది. ప్రతి క్లాసుదగ్గరా వందలకొలదీ జనం క్యూలో నిలబడ్డారు. వెనక నిల్చుంటే సినిమా చూడలేడు...టికెట్ దొరకదు! ఏం చేయాలో తోచక అటూ ఇటూ తిరుగుతున్నాడు. కోరిక ప్రబలంగా వున్నప్పుడు అణుచుకోవటం చాలాకష్టం! రూపాయిపావలా టికెట్ ఇచ్చే క్యూకు సమీపంలో తారాడుతుండగా ఎవరో ఒకరు కాస్త దూరంలో తన వేపే చూస్తున్నట్లు గ్రహించి అటు చూచేప్పటికి ఆమె ఎవరో ఒక ఆంగ్లో ఇండియన్ అమ్మాయిలా కన్పించింది. ఆమెవేపు ఒకటికి రెండుమార్లు చూడగా నవ్వి తలూపినట్లనిపించింది. దగ్గరగా వెళ్ళి ఇంగ్లీషులో— “అబ్బా! ఏం గుంపు” అనేప్పటికి “నిజం! నిజం!” అంది ఆమె.

మధు చేతిలోవున్న పత్రిక ఆమె అడిగి తీసుకొని పేజీలు తిరగేయటం ముగించి ఏదో అడిగింది మధు సమాధానం చెప్పాడు ఇలాటివేవో పిచ్చాపాటీ పది నిమిషాలు మాట్లాడుకున్నాక ఆమె కాంటీన్‌కు వెళ్దామని ప్రపోజ్ చేయగా “సరే” అన్నాడు. కాంటిన్‌లో ఐస్ క్రీమ్ తినేప్పుడు ఆమె చెప్పింది భర్త ఆమెను సరిగా చూడడట! ఏదో కంపెనీలో ఉద్యోగం. చెప్పిచెప్పి ఆఖరున భర్తను చెడామడా తిట్టింది. దుష్టుడు, దుర్మార్గుడు, ఛండాలుడూ అనీ! మధు ఆవిడ చెప్పినవాటికి చాలా బాధ పడ్డాడు. ఆమె కథ అతని హృదయాన్ని కలిచి వేసింది. చివరకు తనతోపాటు సినిమాకు రావలసిందిగా కోరగా ఆమె ఒప్పుకుంది ఆడవాళ్ళ క్యూలో ఆమెను నిలబడమని చెప్పి డబ్బుకూడా ఇచ్చాడు. ఆమె నిల్చుంది. తను అటువేపు కెళ్ళి పోస్టర్స్ చూస్తున్నాడు. అలాగే అటువేపుగా వున్న వున్న ఫోటోగ్రాఫ్స్ చూస్తున్నాడు

పదిహేను నిమిషాలయింది. ఆట ప్రారంభించటానికి ఇంకా కొన్ని నిమిషాలు మాత్రం టైం వుంది.

ఇంకా రాదేం? తనను అక్కడే నిల్చోమని చెప్పింది. చూచి ఒక నిమిషం ఆగి ఇటు వస్తే క్యూలో ఎవరూ లేరు! ఆమె కూడా లేదు. “ఏమైంది? ఏమైంది ఆ ఆంగ్లో ఇండియన్ గిరజాల పిల్ల? ఏదీ! ఏదీ!!” అని అనుకుంటూ

అటూ ఇటూ కలియజూచాడు. ఎక్కడా లేదు. 'ఏమిటి మాయ' అనుకున్నాడు మళ్ళీ!

"ఆమె మాత్రం సినిమాకు వెళ్ళలేదు. బహుశా టికెట్ దొరకలేదేమో? ఎక్కడైనా తనకోసం వెదకటం లేదుగదా?" అని నిర్దేశించిన స్థలంలో మరో నాలుగైదు నిమిషాలు ఎదురు చూచాడు. తీరా అమ్మాయి బయటికి వెళ్ళిపోయిందేమో? అలా ఎందుకు చేస్తుంది? నిజంగా చేసిందేమో? అని వివిధ రకాలుగా వూహించుకొని ఆఖరికి జేబు తడుముకోగా ఒక అర్థణా మాత్రం చేతికి తగిలింది 'అయ్యో నేనెట్లా టీ నగర్ చేరుకోటం? ఆపిల్ల నన్ను మోసం చేసింది! మోసం!!" అని గబగబా బయటికొచ్చి చూచాడు. ఎక్కడా ఎవరూ లేరు! తుదకు 'గర్ల్ ఆఫ్ ది ఇయర్' చూడలేని మధు ఘాత్కారం చేసుకుంటూ, నడుస్తున్నాడు. మౌంట్‌రోడ్ చేరుకున్నాడు! దీపకాంతికి తారురోడ్ ఆఫీసు మేనేజరు బట్టతలలాగా ధగధగా మెరుస్తోంది. కాని మధుకు ఇదేమీ పట్టలేదు. ఏదో పోగొట్టుకున్న వాడివలె విచారంగా ఫుట్‌పాత్ మీద - బరువైన కాళ్ళను ముందుకు నెడుతున్నాడు.

ఎటో వెళ్ళాల్సి ఎటో వెళ్ళి ఎలాగయితేనేం టీ. నగర్ సరిహద్దుల్ని చేరుకునేప్పటికి తొమ్మిదయింది. "పాండీబజార్"లోకి వచ్చి కొద్దిదూరం నడవగా నడవగా తను చేరుకోవలసినచోటు దగ్గరికొస్తోంది. ఆ చోటు దగ్గరికొచ్చిన కొద్దీ తనలో ఆకలి మండుకవస్తోంది. నగర్ కేఫ్, భారత కేఫ్, దాటిపోయాడు. దుర్గా కేఫ్ కూడా వెనకనే పోయింది. "ఆకలేస్తోంది. మంగళవారంనాడుగాని జీతంరాదు! రేపెలాగు? రేపుగాదు ఇప్పుడెలాగు? ఆకలేస్తోంది ఆకలి!" జేబు తడుముకోగా ఏమీ లేదు. మిగిలిన అర్థణా కూడా కోపంవల్ల ఎక్కడో విసిరికొట్టాడు.

* * *

రాత్రి తొమ్మిదిన్నరయింది. జనసంచారం తగ్గిపోయింది. ఉండి ఉండి ఎవరో ఒకరు దగ్గుకుంటూ వెళ్తున్నారు "పానగల్ పార్కు"లోని రేడియో ఎప్పుడో గొంతుక కట్టేసింది. క్లబ్బులో ఇంకా సందడిగానే వుంది.

మధు రామకృష్ణ మిషన్ హైస్కూల్ భవనం ముందుకొచ్చి ఒక్కసారిగా ఆగిపోయాడు. ఆ చెట్టుకు సమీపంలో తను సాయంత్రం చూచిన కుంటి ముసలాడు నిద్ర పోతున్నాడు. హైస్కూల్ భవనం ఉదయంనించి కూడా నిద్రపోతున్నట్లే వుంది. వెంకటనారాయణరోడ్డు సాయంత్రం కంటే ఇప్పుడింకా అందంగా వుంది-ప్రక్కన ఒకే వరసలో వెలిగే దీపాల కాంతికి!

మధు నలువేపులా చూచి మెల్లగా నిద్రపోయే ముసలాడి దగ్గరికెళ్లి- తలక్రింద పెట్టుకున్న గుడ్డకు ఒక మూలన కట్టివున్న డబ్బుల మూటను వూడతీస్తూండగా ముసలాడు లేచి, "ఎవరు? ఎవరు?" అని అనేప్పటికే మధు గుడ్డకు కట్టివున్న డబ్బులు వూడతీసుకొని పరుగెత్తాడు. "దొంగ! దొంగ" అని ముసలాడు కేకేసేప్పటికే మధు చాలా దూరం వెళ్ళిపోయాడు.

తమిళనాడు ఓటర్ల పార్టీ అని ఒకటిట! వీరు పొట్టవైపు చూపించే చేతితో ఒక మానవాకృతిని ఎన్నికల చిహ్నంగా ఎన్నుకొన్నారు సామాన్యంగా రైళ్ళలోను, బస్సుస్టాండుల్లోనూ, అరచపిల్లలు అగ్గిపెట్టెలపై దరువువేస్తూ సినిమా పాటలనో, లక్ష్మీకాంతం కేసునో, గాంధీజీ మృతినో, పాడుకొంటూ బిచ్చమెత్తటం మనకు కనిపించే దృశ్యం. వీరు పాట కొంతసేపు పాడి, దాతల హృదయాలను కరగించేందుకు పొట్ట అక్కలించి దానిపై "దబదబా" బాదుకొంటారు. అలా బాదుకొంటంచేత ఆ ప్రాంతం కమిలిపోయి మరింత నల్లబడి వుంటుంది. ఓట్లను అర్థించటానికి కూడా ఇలాంటి గుర్తే కావాలి! —'జైహింద్' నుండి.